కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.11, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 32, పందిరి బీర 40, క్యాబేజీ 13, క్యారెట్ 23, దొండ 35, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 18, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 27, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 60, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 10–12, ముల్లంగి 4–5. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు ఫుట్‌పాత్ వ్యాపారుల సమస్యలు పరిశీలించనున్న ఎమ్మెల్యే

సనత్‌నగర్: ఫుట్‌పాత్ వ్యాపారుల సమస్యలపై సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ గురువారం పర్యటించనున్నారు. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసు అధికారులతో కలిసి ఫుట్‌పాత్ వ్యాపారుల సమస్యలను తెలుసుకోనున్నారు. ఉదయం 10 గంటలకు పాలికబజార్ చౌరస్తా, అంజలి టాకీస్ దర్గా వెనుక ప్రాంతం, ప్యాట్నీ చౌరస్తాలోని చందనబ్రదర్స్, పీజీ రోడ్డులోని మమతా స్వీట్ హౌస్, మినిస్టర్ రోడ్డులోని కిమ్స్ హాస్పటల్, బేగంపేటలోని ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ ప్రాంతాల్లో పర్యటిస్తారు.

టీజీపీసీబీ కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి

సనత్‌నగర్: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) నూతన సంవత్సర కేలండర్‌ను బుధవారం సభ్య కార్యదర్శి రవి ఆవిష్కరించారు. టీజీపీసీబీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీవాత్సవ్, జనరల్ సెక్రటరీ కృపానంద్, చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రఘు, జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్ సత్యనారాయణరావు, హనుమంతరెడ్డి, వినయ్‌కుమార్‌నాయుడు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మోహన్‌బాబు



సనత్‌నగర్: బేగంపేట మయూరిమార్గ్ అంబేడ్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మోహన్‌బాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకుంటూ సభ్యులు తీర్మానం చేశారు. నూతన అధ్యక్షుడు మోహన్‌బాబు మాట్లాడుతూ సభ్యులందరినీ కలుపుకునిపోతూ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి తనకు బాధ్యతలు అప్పగించిన సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు రాములుతో పాటు బస్తీ ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఎనిమిది మందికి జైలు

సనత్‌నగర్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 24 మందిని బేగంపేట పోలీసులు బుధవారం నాంపల్లిలోని కోర్టులో హాజరుపర్చారు. 16 మందికి రూ.2,100 చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు. అలాగే రెండోసారి పట్టుబడ్డ ముగ్గురికి రూ.3,300 జరిమానాతో పాటు నాలుగు రోజుల జైలు శిక్ష విధించారు. మొదటిసారి పట్టుబడ్డ ఐదుగురికి రూ.2,100 జరిమానాతో రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య తెలిపారు.

సినిమా లాభాలతో నిరుపేదలకు వైద్యమందిస్తాం

పంజగుట్ట: ఈనెల 24న విడుదల కానున్న 'డియర్ కృష్ణ' సినిమా ద్వారా వచ్చిన లాభాలతో క్రానిక్ కంస్ట్రక్టివ్ పెరికార్డిటిస్‌తో బాధపడుతున్న 20 ఏళ్ల లోపు వారికి ఉచితంగా శస్త్రచికిత్స చేయిస్తామని సినిమా నిర్మాత పీఎన్ బలరాం అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మాత కుమారుడు, సినిమా హీరో అక్షయ్ కృష్ణ, నటుడు లోహిత్, రవికిశోర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నందు గిడుతూరితో కలిసి మాట్లాడారు. దైవం, భక్తుడు, తండ్రి, కుమారుడి మధ్య జరిగిన యదార్థ ఘటన ఆధారంగా సినిమా తీసినట్లు ఆయన తెలిపారు.

ఆకట్టుకున్న వార్షికోత్సవం

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడలోని మహాత్మా గాంధీ మెమోరియల్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలను రవీంద్రభారతిలో కాన్వాస్ క్రియేటివిటి పేరిట బుధవారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా క్రీడా పోటీలు ఏర్పాటు చేశారు. స్కూల్స్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుతో పాటుగా క్రీడల్లోనూ రాణిస్తే మరింత ఉన్నత శిఖరాలు అందుకోవచ్చన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ డిప్యూటీ డీఈఓ శ్యామ్యూల్‌రాజ్, స్కూల్ చైర్మన్ ఎం.ఎం.నాయుడు, ప్రిన్సిపాల్ కిరణ్ నాయుడు, కోచ్ ఇమ్రోజ్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

లక్ష్యం.. గ్రీన్ సికింద్రాబాద్

పార్కుల అభివృద్ధికి పక్కా ప్రణాళిక

పచ్చదనం పెంపుపై దృష్టి | స్థానికుల సమన్వయంతో ఉద్యానవనాల అభివృద్ధి | నాలాల వద్ద పచ్చటి తోరణాలు

సాక్షితో నూతన డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌కుమార్

బన్సీలాల్‌పేట్: "ఈ మహానగరంలో ఎటు చూసినా కనిపించేది వాహనాలే.. కాసేపు ఎక్కడైనా సేదదీరుదామంటే కనుచూపు మేరలో కూడా పచ్చదనం కనిపించదు..పచ్చని చెట్ల కింద ఎక్కడైనా విశ్రాంతి తీసుకుందామంటే దానికోసం ప్రత్యేక సమయం కేటాయించాలి.. కిలోమీటర్ల కొద్దీ వెళ్లాలి.. అందుకే స్థానికంగా ఉండే పార్కులపై దృష్టి సారించాం.. పచ్చదనాన్ని పెంపొందించే చర్యలు చేపట్టాం" అని చెబుతున్నారు జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోన్ ఉద్యానవన శాఖ నూతన డిప్యూటీ డైరెక్టర్ పి.అనిల్‌కుమార్. అటవీశాఖ నుంచి బదిలీపై వచ్చిన అనిల్‌కుమార్ బుధవారం తన కార్యాలయంలో సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు.. ఆయన మాటల్లోనే...

పచ్చదనంతో పరిసరాలు....ప్రధాన రహదారులు పార్కులు, రోడ్ల కూడళ్లు అందంగా...ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడానికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగాలని నిర్ణయించాము. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరిస్తూ అందరి సహకారంతో మొక్కలు పెంపకం ద్వారా పచ్చదనం కాపాడటమే లక్ష్యంగా ముందుకు సాగుతామని జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోన్ ఉద్యానవన శాఖ నూతన డిప్యూటీ డైరెక్టర్ పి. అనిల్‌కుమార్ చెప్పారు.

కొత్త థీమ్ పార్కుల ఏర్పాటు

జోన్ పరిధిలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా పార్కులను విస్తరిస్తాం. అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు తయారుచేస్తున్నాం. కొత్త థీమ్ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించాము. ఇప్పటికే న్యూబోయిగూడ ప్రాంతంలో థీమ్ పార్కును తీర్చిదిద్దాము. పద్మారావునగర్ వెంకటాపురం కాలనీ, బ్రూక్‌బాండ్ ప్రాంతాల్లో థీమ్ పార్కులను అభివృద్ధి చేశాము. పార్కులు అందంగా..ఆకర్షణీయంగా గా ఉండే విధంగా తీర్చిదిద్దుతున్నాము.



స్థానికులతో సమన్వయం చేసుకొని..

పార్కుల అభివృద్ధికి స్థానికులను సమన్వయం చేసుకొని ప్రణాళికలు రూపొందిస్తున్నాం. స్థానిక కాలనీ, అపార్టుమెంట్ సంఘాలు, పార్కు వాకర్స్ అసోసియేషన్‌లతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నాం. వందలాది మంది సిబ్బంది పచ్చదనం కోసం పనిచేస్తున్నారు.

ఆకట్టుకునేలా గ్రీనరీ

పార్కుల్లో అందమైన రంగు రంగుల పూలను ఏర్పాటు చేస్తూ గ్రీనరీని తీర్చిదిద్దుతున్నాము.

సికింద్రాబాద్ జోన్ పరిధిలో..

సికింద్రాబాద్ జోన్ పరిధిలో బేగంపేట్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, అంబర్‌పేట్, ముషీరాబాద్ సర్కిళ్లు ఉన్నాయి. సుమారు 155 పార్కులు ఉన్నాయి. నిత్యం వందలాది మంది పార్కులను సందర్శిస్తున్నారు. అంతేకాక ఇందిరా పార్కు, క్లాక్‌టవర్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం పార్కు, ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో వేలాది మంది సేదతీరుతున్నారు. ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటి పచ్చదనంతో అందంగా తీర్చిదిద్దుతాం.


ఇందిరా పార్కు

పార్కుల అభివృద్ధిని కాంట్రాక్టర్లకు అప్పగించిన తరువాత నిర్వాహణ బాధ్యత స్థానిక కాలనీ అసోసియేషన్లకు అప్పగించాం. మొత్తం పనులను మా సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు.

నాలాల వద్ద పచ్చని తోరణాలు

ప్రధాన రహదారుల పక్కనున్న నాలాలు కనిపించకుండా పచ్చదనంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నాము. నాలాలను పచ్చని ఆకుల తోరణాల తీగలతో పూర్తిగా కప్పివేసి కనువిందుగా తయారుచేస్తాం. అంతేకాక ఎక్కడైనా ఓపెన్ స్థలాలు ఉండి సదరు యజమాని ముందుకు వస్తే అక్కడ పచ్చదనం పెంపొందడానికి ప్రభుత్వ పరంగా సహకరిస్తాం. మొక్కలను ఉచితంగా పంపిణీ చేయడంతోపాటు వాటి అభివృద్ధికీ తోడ్పాటునందిస్తాం.

రహదారుల ఆధునీకరణకు ప్రత్యేక కార్యాచరణ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌సీ రవికిరణ్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

సికింద్రాబాద్: ప్రధాన రహదారుల ఆధునీకరణ, ట్రాఫిక్ సమస్యల నివారణకు జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం (సికింద్రాబాద్) జోనల్ కార్యాలయంలో బుధవారం 'కన్వర్‌జెన్స్' కమిటీ సమావేశం జరిగింది. జోనల్ కమిషనర్ ఎస్.రవికిరణ్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో జీహెచ్‌ఎంసీ, విద్యుత్, ట్రాఫిక్ పోలీస్, జలమండలి, అధికారులు పాల్గొన్నారు. గత అక్టోబర్ నెలలో జరిగిన సమావేశంలో నిర్ణయించిన రహదారుల సుందరీకరణ, విస్తరణ పనులు జరుగుతున్న తీరుపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లకు సూచించారు. ముఖ్యంగా సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్, సంగీత్ కూడలి ప్రాంతాల సిగ్నళ్ల వద్ద జీబ్రా లైన్లు ఏర్పాటు చేయడం, నాగమయ్యకుంట, గాంధీ ఆసుపత్రి ప్రాంతంలోని డెబ్రిస్‌ను బయటకు తరలించడం, మ్యాన్‌హోల్ మరమ్మతు చేయడం, వివిధ సర్కిళ్ల పరిధిలో యూ టర్న్‌ల ఏర్పాటు, రహదారుల విస్తరణ, ఫుట్‌పాత్‌ల ఏర్పాటు వంటి అంశాలపై చర్చలు జరిపారు. సమావేశంలో ట్రాఫిక్ డీసీపీ రాహుల్‌హెగ్డే, కంటోన్మెంట్ బోర్డు జాయింట్ సీఈఓ పల్లవి, జీహెచ్‌ఎంసీ అధికారులు రత్నాకర్, రఘునందన్, ప్రాజెక్ట్స్ ఈఈ రోహిణి, కంటోన్మెంట్ బోర్డు ప్లానర్ ఫణికుమార్, ఐదు సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు


రేషన్, ఇందిరమ్మ ఇళ్ల సర్వేలను పర్యవేక్షిస్తున్న డీసీ సుభాష్‌రావు, కార్పొరేటర్ హేమ

చిలకలగూడ: ప్రభుత్వం ప్రకటించిన నూతన రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్ల అర్హులైన వారికి అందిస్తామని, దళారులను నమ్మి మోసపోవద్దని జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమలు సూచించారు. డివిజన్ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ పనులపై నామాలగుండులోని వార్డు కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, అర్హులైన అందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని, సర్వేలను పారదర్శకంగా చేపట్టాలని కార్పొరేటర్ హేమ కోరారు. అనంతరం డివిజన్ పరిధిలో జరుగుతున్న రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వే సరళిని పరిశీలించారు. వార్డు కార్యాలయ ఇంచార్జి సంధ్యారాణి పాల్గొన్నారు.

ఓయూలో ముగిసిన జాతీయ సదస్సు


సదస్సుకు హాజరైన ప్రతినిధులతో అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ లింగ్విస్టిక్స్ విభాగం, భారతీయ భాషా సమితి ఆధ్వర్యంలో భారతీయ భాషాపరివారం అనే అంశం పై రెండు రోజులు జరిగిన జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. వివిధ భారతీయ భాషల మధ్య ఉన్న సంబంధాల గురించి చర్చించారు. ముగింపు సమావేశానికి ప్రాంతీయ కోర్డినేటర్లు ప్రొ.బాలునాయక్, ప్రొ.స్వాతి వ్యవహరించంగా చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీ వీసీ ప్రొ.సూర్యధనుంజయ్, ఢిల్లీ వర్సిటీ ప్రొ. ఆర్సీ శర్మ, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.కాశీం తదితరులు పాల్గొని ప్రసంగించారు. సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన 150 మంది ప్రతినిధులు పాల్గొని పరిశోధన పత్రాలను సమర్పించారు.

ఢిల్లీ రిపబ్లిక్ డే వేడుకలకు ఆహ్వానం


టీఎన్ శ్రీనివాస్

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్‌కు అరుదైన అవకాశం దక్కింది. ఈ నెల 26 ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే వేడుకలకు ఆయనకు కేంద్రం నుంచి ప్రత్యేక ఆహ్వానం దక్కింది. వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తితో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దృష్టిని ఆకర్షించిన బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్ గురించి, ప్రధాని తన 'మన్ కీ బాత్'లో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ప్రసార మంత్రిత్వ శాఖ గతేడాది బోయిన్‌పల్లి మార్కెట్ సెక్రెటరీని రిపబ్లిక్ డే వేడుకలకు ఆహ్వానించగా, తాజాగా మాజీ చైరన్‌కు ఆహ్వానం పంపారు. తనకు ప్రత్యేక ఆహ్వానం రావడం పట్ల శ్రీనివాస్ సంతోషం వ్యక్తం చేశారు.

సంస్థలో పనిచేసే మహిళా ఉద్యోగిపై లైంగిక దాడి

రాంగోపాల్‌పేట్: తన సంస్థలో పనిచేస్తున్న ఓ మహిళపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని మహంకాళి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన మేరకు.. ఓ మహిళ (33) 2018 సంవత్సరంలో పార్క్‌లేన్‌లోని ఇన్‌క్రెడిబుల్ ఇండియా హోటల్ ఎదురుగా జైన్ ఎస్టేట్ బిల్డింగ్‌లో ఉండే ఇన్నోవేటివ్ టెక్ ప్యాక్ లిమిటెడ్ సంస్థలో రిసెప్షనిస్టుగా చేరింది. ఆ సంస్థ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ కేతినేని సాయాజీరావు(65) ఆమెకు కూల్‌డ్రింక్‌లో మత్తు మందు కలిపి తాగించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అప్పటి నుంచి తన వద్ద నీ ఫొటోలు ఉన్నాయని బెదిరిస్తూ పలు దఫాలుగా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇలా పలుసార్లు దారుణానికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు ఈ నెల 16వ తేదీన మహంకాళి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసికున్న పోలీసులు నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

గొల్లకురుమల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి


మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన గొల్లకురుమ సంఘం నాయకులు

లాలాపేట: గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం నాయకుల బృందం బుధవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆయన నివాసంలో కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు తెలంగాణలోని గొర్రెల కాపరులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మల్లన్న దేవాలయాలకు గొల్లకురుమలనే చైర్మెన్‌లుగా నియమించాలని కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా. కొమ్ము అశోక్ యాదవ్, రామచంద్రయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి అనేక పథకాలు

ఎమ్మెల్యే శ్రీగణేష్


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: పేదల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. బుధవారం గన్‌బజార్‌లో 85 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లు,, రేషన్‌కార్డుల కోసం అధికారులు సర్వే చేస్తున్నారని, అర్హులైన వారందరికీ పథకాలు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ తహసిల్దార్ పాండు నాయక్, కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు హైదర్ పాల్గొన్నారు.

స్వామిరామానందతీర్థ అడుగుజాడల్లో నడుద్దాం

సనత్‌నగర్: స్వామిరామానంద తీర్థ వర్ధంతిని బేగంపేట్ బ్రాహ్మణవాడీలోని స్వామిరామానందతీర్థ మెమోరియల్ కమిటీ ప్రాంగణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ వాణీదేవి హాజరై స్వామిజీకి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పీవీ గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షుడు పీవీ ప్రభాకర్‌రావు, సురభి సోలార్ ఎనర్జీ డైరెక్టర్ శేఖర్ మారంరాజు, శ్రీరామానందతీర్థ మెమోరియల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వాసుకీ, అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.


స్వామిరామానందతీర్థ వర్ధంతి కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ వాణీదేవి

తులం బంగారం హామీని ఎప్పుడు అమలు చేస్తారు?

ఎమ్మెల్యే తలసాని


చెక్కులను పంపిణీ చేస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్: తులం బంగారం హామీని ఎప్పుడు అమలు చేస్తారని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాయలంలో 108 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఇవ్వడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిందని, చెక్కులతో పాటు తులం బంగారం హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేశ్వరి, హేమలత, తహసీల్దార్ పాండునాయక్, మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి అరుణగౌడ్, మల్లికార్జున్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి


ప్రిన్సిపల్ సెక్రెటరీకి వినతి పత్రం సమర్పిస్తున్న ఓయూ ఉద్యోగులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో గత 25 ఏళ్లుగా పని చేస్తున్న 1200 మంది కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ యోగితా రాణకి బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఓయూలో 30 ఏళ్లుగా ఉద్యోగాలు భర్తీ చేయనందున 2500 నాన్‌టీచింగ్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వివరించినట్లు కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ చైర్మన్ సూర్య చందర్ తెలిపారు. కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలు చేపడుతూ కొంత కాలం తరువాత ఉద్యోగాలను పర్మనెంట్ చేశారని చెప్పారు. కార్యక్రమంలో కట్ట వెంకటేష్, అరుణ్‌కుమార్, తక్కల చైతన్, చేరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారులను వేధించడం తగదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సికింద్రాబాద్: ఫుట్‌పాత్ వ్యాపారులపై ట్రాఫిక్, జీహెచ్‌ఎంసీ అధికారులు మూకుమ్మడిగా ఉక్కుపాదం మోపడం తగదని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఫుట్‌పాత్‌లను నమ్ముకుని చిరు వ్యాపారాలు చేసుకునే వారి పట్ల ప్రభుత్వం, అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ఆయన చెప్పారు. బుధవారం సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ నార్త్ జోన్ కార్యాలయంలో ఆయన జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మోండాతోపాటు పలు ప్రధాన రహదారుల్లో ఫుట్‌పాత్‌లపై వందలాది మంది ఐదు దశాబ్దాలుగా తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని అధికారుల దృష్టికి తెచ్చారు. తాజాగా అధికారులు ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు తొలగిస్తున్న ఫలితంగా వందలాది కుటుంబాలు రోడ్డున పడతాయని చెప్పారు. సమావేశంలో జోనల్ కమిషనర్ ఎస్.రవికిరణ్, ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, బేగంపేట కార్పొరేటర్ టి. మహేశ్వరి, బేగంపేట డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య పాల్గొన్నారు.

త్వరలో కంటోన్మెంట్‌కు కేంద్ర నిధులు


ఇక్రిసాట్ కాలనీలో పర్యటిస్తున్న బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: కంటోన్మెంట్ అభివృద్ధికి త్వరలోనే కేంద్రం ప్రత్యేక నిధులు అందజేయనుందని బోర్డు సభ్యుడు రామకృష్ణ తెలిపారు. బుధవారం బోర్డు అధికారులతో కలిసి ఆరోవార్డు ఇక్రిశాట్ కాలనీలో పర్యటించిన ఆయన స్థానికులతో ప్రత్యేకంగా సమావేశమై సమస్యలపై చర్చించారు. కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ లైన్‌లను అభివృద్ధి చేయాల్సిందిగా స్థానికులు ఆయనను కోరారు. బోర్డు పరిధిలో పరిమితి నిధులతో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని రామకృష్ణ తెలిపారు. కంటోన్మెంట్‌లో అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు ఇవ్వాల్సిందిగా కేంద్రాన్ని కోరగా, సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ


అంబేద్కర్ కళాశాలలో జరిగిన ఎన్‌సీసీ డేలో డాక్టర్ విష్ణుప్రియ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఎన్‌సీసీలో చేరడం వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ పెరుగుతుందని అంబేడ్కర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విష్ణుప్రియ అన్నారు. ఇలాంటి ఉత్తమమైన అవకాశాన్ని ప్రతి విద్యార్థి అందిపుచ్చుకోవాలని సూచించారు. బుధవారం కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ఎన్‌సీసీ డేను ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ విద్యార్థులకు ర్యాంకింగ్ ప్రమోషన్స్ ఇచ్చిన అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్‌సీసీ ప్రదర్శన ఆకట్టుకునేలా సాగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విష్ణుప్రియ మాట్లాడుతూ... ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు దేశానికి సేవ చేసే లక్షణాలు అలవడుతాయని అన్నారు. నాయకత్వ లక్షణాలతో పాటు మంచి వ్యక్తిత్వ వికాసాన్ని అలవర్చుకోగలుగుతారని చెప్పారు.